RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్ దినపత్రిక


వరంగల్ | మంగళవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:88 | మార్చి 17, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్
9701923260

## యూపీఐ లావాదేవీల ద్వారా రూ.14.77 లక్షల లంచం

- సూపరింటెండెంట్ అరెస్ట్
- కరీంనగర్‌లో అవినీతి నిరోధక శాఖ చర్యలు
- బినామీ ఖాతా ద్వారా డబ్బులు తీసుకున్న అధికారిపై కేసు



2లో




ఓ వైపు విద్యాసంస్థల ప్రెజర్.. మరో వైపు తల్లిదండ్రుల ప్రెస్టేజ్

## పసి ప్రాణాలను బలిగొంటున్న పోటీ తత్వం

- యంత్రాలుగా మారుతున్న చిన్నారులు
- సృజనాత్మకతకు తావులేని వైనం
- పరీక్షల వేళ పెరుగుతున్న మానసిక ఆందోళనలు
- ఉదయం నుంచి రాత్రి వరకు విశ్రాంతి లేని షెడ్యూల్స్
- ఫెయిల్ అయితే తనువు చాలిస్తున్న పసి హృదయాలు
- తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాల వైఖరి మారాలి
- విద్యార్థులకు సమాజమే భరోసా కల్పించాలంటున్న నిపుణులు

2లో

# మార్కులు.. ర్యాంకులు..!

## చదువుల ఒత్తిడిలో విద్యార్థి లోకం

వేద న్యూస్, (ఎల్.కే) ప్రత్యేక ప్రతినిధి

జ్ఞానాన్ని ప్రసాదించి, విజ్ఞతను పెంచాల్సిన అక్షరధామాలు.. నేడు మార్కులు, ర్యాంకులను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలుగా మారుతున్నాయి. ఆధునిక విద్యా వ్యవస్థ ఒక పవిత్రమైన బోధనా ప్రక్రియలా కాకుండా, కార్పొరేట్ శక్తుల చేతుల్లో ఒక అనారోగ్యకరమైన పరుగు పందెంలా మారిపోయింది. ఉదయం ఆరు నుంచి రాత్రి పది వరకు విశ్రాంతి లేని క్లాసులు, నిరంతర పరీక్షల ఒత్తిడిలో విద్యార్థులు తమ విలువైన బాల్యాన్ని, సహజసిద్ధమైన సృజనాత్మకతను బలిపెడుతున్నారు. కేవలం పుస్తకాల్లోని విషయాన్ని బట్టీ పట్టి మార్కులు సాధించే యంత్రాలుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఈ క్రమంలో, వారి ఆలోచనా శక్తి హరించుకు పోతోంది. మరోవైపు, విద్యా సంస్థల ఒత్తిడికి తోడు తల్లిదండ్రుల మితిమీరిన ఆశలు పిల్లలపై మోయలేని భారాన్ని మోపుతున్నాయి. పక్క ఇంటి పిల్లలతో పోలికలు, సమాజంలో గుర్తింపు కోసం ఆరాటపడే పెద్దల ధోరణి పిల్లల్లో అభద్రతా భావాన్ని, ఆత్మన్యూనతను పెంచుతోంది. ఒక్క మార్కు తక్కువ వచ్చినా జీవితమే ముగిసిపోయిందనే భ్రమలో, చిగురు టాకుల్లాంటి పసి ప్రాణాలు ఆత్మహత్యల వంటి దారుణమైన నిర్ణయాలు తీసుకోవడం నేటి విద్యా వ్యవస్థ వైఫల్యానికి పరాకాష్ట. కేవలం ఉద్యోగాల కోసమే చదువు అనే ధోరణి వీడి, మనిషి ప్రాణం విలువను గుర్తించేలా విద్యా విధానంలో సమూల మార్పులు రావాల్సిన సమయం ఆసన్నమైంది.


## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ



2లో

- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేయాలి
- ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై చర్యలు తీసుకోవాలి
- సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి

## రాష్ట్రాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టారు..



2లో

### నీటి హక్కుల విషయంలో తెలంగాణకు అన్యాయం

- కృష్ణా, గోదావరి జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపులేదు
- అసెంబ్లీ మీడియా హాల్‌లో కాంగ్రెస్‌పై హరీశ్ రావు తీవ్ర విమర్శలు

## నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

- ప్రముఖ కవికి లభించిన జాతీయ గుర్తింపు
- అభినందనలు తెలిపిన కేసీఆర్
- 'అనిమేష' కవితా సంపుటికి అవార్డు

2లో



వేద న్యూస్, హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రదానం చేసే అత్యున్నత సాహిత్య పురస్కారం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు – 2025 ప్రముఖ తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికి దక్కడం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డికి ఆయన అభినంద నలు తెలుపుతూ శుభాకాంక్షలు తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాన్ని, ముఖ్యంగా మానవ సంబంధాల్లో ఏర్పడిన విచ్ఛిన్నతను కవిత్వం ద్వారా హృద్యంగా ప్రతిబిం బించిన దీర్ఘ కవితా సంపుటి "అని మేష"కు ఈ ప్రతిష్టాత్మక

మిగతా 2వ పేజీలో..

# నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

మొదటి పేజీ తరువాయి..



అవార్డు రావడం గర్వకారణమని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ కవితా సంపుటి సమకాలీన సమాజాన్ని ఆలోచింపజేసేలా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ మట్టివాసన తెలిసిన కవిగా నందిని సిధారెడ్డి తన రచనల ద్వారా తెలంగాణ జీవన విధానాన్ని అక్షరబద్ధం చేశారని కేసీఆర్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల భావోద్వేగాలను తన కవిత్వంలో ప్రతిబింబింపజేసి తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంగా మంజీరా రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసి సాహిత్య రంగంలో ఆయన విశేష సేవలు అందించారని కేసీఆర్ గుర్తుచేశారు. సామాజిక సమానత్వం, ప్రజా సమస్యలపై స్పందిస్తూ తన కలాన్ని సమాజానికి అంకితం చేసిన రచయితగా ఆయన నిలిచారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా నందిని సిధారెడ్డి తన సాహిత్యం, పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారని కేసీఆర్ తెలిపారు. ఉద్యమ కవిగా ప్రజల్లో చైతన్యం రగిలించి తెలంగాణ ప్రజల అభిమానాన్ని పొందారని పేర్కొన్నారు. ఈ అవార్డు తెలంగాణ సాహిత్యానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు కేసీఆర్ అన్నారు.


# రాష్ట్రాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టారు

## నీటి హక్కుల విషయంలో తెలంగాణకు అన్యాయం

- కృష్ణా, గోదావరి జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపులేదు
- అసెంబ్లీ మీడియా హాల్‌లో కాంగ్రెస్‌పై హరీష్ రావు తీవ్ర విమర్శలు


**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న వైఖరి వల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. సమైక్య రాష్ట్ర కాలంలో నీటి విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసిందని హరీష్ రావు పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్ నాయకత్వంలో కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను బలంగా నిలబెట్టామని చెప్పారు. కృష్ణా నదిలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి నీటి పునఃపంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గోదావరి నదిపై బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం తెలంగాణకు ఉన్న హక్కులను కాపాడేందుకు గత ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ఆయన అన్నారు. గోదావరిలో మొత్తం 1400 టీఎంసీల నీటిలో 968 టీఎంసీలు తెలంగాణకు, 518 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడ్డాయని వివరించారు. ఈ హక్కులను స్థిరపరచడానికి అనేక ప్రాజెక్టులను నిర్మించి 400 టీఎంసీల ప్రాజెక్టులకు అనుమతులు సాధించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ ప్రభుత్వం కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని హరీష్ రావు ఆరోపించారు. కృష్ణా నదిలో నీటి వినియోగంపై వివాదాలు కొనసాగుతుండగా ఇప్పుడు గోదావరి జలాలపై కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. జనవరి 30న ఢిల్లీలో రెండు రాష్ట్రాల ఇరిగేషన్ ఉన్నతాధికారుల సమావేశం జరిగినట్లు ఆయన తెలిపారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్ ఫిబ్రవరి 12నే రాష్ట్రానికి వచ్చినప్పటికీ నెలరోజులు గడిచినా తెలంగాణ ప్రభుత్వంవైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదని విమర్శించారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, లేఖల డ్రామాలు మానుకుని తెలంగాణ ప్రయోజనాలను రక్షించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.



# మార్కులు.. ర్యాంకులు..!

**వేద న్యూస్, (ఎల్.కే) ప్రత్యేక ప్రతినిధి**



- చదువుల ఒత్తిడిలో విద్యార్థి లోకం
- ఓ వైపు విద్యాసంస్థల ప్రెజర్.. మరో వైపు తల్లిదండ్రుల ప్రెస్టేజ్
- పసి ప్రాణాలను బలిగొంటున్న పోటీ తత్వం
- యంత్రాలుగా మారుతున్న చిన్నారులు
- సృజనాత్మకతకు తావులేని వైనం
- పరీక్షల వేళ పెరుగుతున్న మానసిక ఆందోళనలు
- ఉదయం నుంచి రాత్రి వరకు విశ్రాంతి లేని షెడ్యూల్స్
- ఫెయిల్ అయితే తనువు చాలిస్తున్న పసి హృదయాలు
- తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాల వైఖరి మారాలి
- విద్యార్థులకు సమాజమే భరోసా కల్పించాలంటున్న నిపుణులు

నేటి ఆధునిక విద్యా వ్యవస్థ కేవలం మార్కులు, ర్యాంకుల చుట్టూ తిరుగుతున్న ఒక వ్యాపార చక్రంలా మారిపోయింది. విద్య అనేది జ్ఞానాన్ని పంచి, విజ్ఞతను పెంచాల్సింది పోయి.. కేవలం పోటీ ప్రపంచంలో ఒక పరుగు పందెంలా తయారైంది. కార్పొరేట్ విద్యా సంస్థల మధ్య నెలకొన్న అనారోగ్యకరమైన పోటీలో విద్యార్థులు కేవలం నెంబర్లుగా మిగిలిపోతున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విరామం లేని క్లాసులు, నిరంతర పరీక్షలు, ర్యాంకుల వేటలో పిల్లలు తమ బాల్యాన్ని, సృజనాత్మకతను పూర్తిగా కోల్పోతున్నారు. చదువు అంటే పుస్తకాల్లోని విషయాన్ని బట్టీ పట్టడం అనే స్థాయికి పడిపోవడం వల్ల, విద్యార్థుల్లో ఆలోచనా శక్తి నశించి వారు కేవలం పరీక్షలు రాసే యంత్రాలుగా మారుతున్నారు.

### తల్లిదండ్రుల మితిమీరిన ఆశలు

విద్యా సంస్థల ఒత్తిడి ఒకవైపైతే, తల్లిదండ్రుల మితిమీరిన ఆశలు పిల్లలపై మోయలేని భారంగా మారుతున్నాయి. తమ పిల్లలు పక్క ఇంటి పిల్లల కంటే లేదా బంధువుల పిల్లల కంటే గొప్ప ర్యాంకులు సాధించాలనే కోరికతో వారిపై నిరంతరం ఒత్తిడి తెస్తున్నారు. ప్రతి బిడ్డకు ఒక ప్రత్యేకమైన నైపుణ్యం ఉంటుందని గుర్తించడంలో పెద్దలు విఫలమవుతున్నారు. మార్కులు తక్కువ వచ్చినప్పుడు కించపరచడం, ఇతరులతో పోల్చి చూడటం వల్ల విద్యార్థుల్లో ఆత్మన్యూనతా భావం పెరిగి, వారు మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. ఫలితంగా, చిగురుటాకుల్లాంటి ప్రాణాలు పరీక్షల భయంతో తనువు చాలిస్తున్న వార్తలు వినాల్సి రావడం సమాజానికే తీరని అవమానం.

### పిల్లల్లో అభద్రతా భావం

ప్రస్తుత విద్యా విధానంలో క్రీడలు, కళలు, సామాజిక స్పృహ వంటి అంశాలకు ప్రాధాన్యత కనుమరుగవుతోంది. కేవలం గణితం, సైన్స్ సబ్జెక్టులకే ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల మెదళ్లను కట్టిపడేస్తున్నారు. క్రీడా మైదానంలో గడపాల్సిన సమయాన్ని కూడా క్లాసు గదుల్లోనే బంధించడం వల్ల వారిలో శారీరక, మానసిక దృఢత్వం తగ్గిపోతోంది. పరీక్షల సమయం దగ్గర పడే కొద్దీ విద్యార్థుల్లో అభద్రతా భావం, నిద్రలేమి, ఆకలి మందగించడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక్క మార్కు తక్కువ వచ్చినా తమ జీవితం ముగిసిపోయిందనే భ్రమలో విద్యార్థులు ఉండటం విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం.

### ఆత్మహత్యల నివారణ విద్యా సంస్థల బాధ్యత

విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టడానికి విద్యా సంస్థలు తక్షణమే మేల్కోవాలి. ప్రతి పాఠశాల, కళాశాలలో విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం ప్రొఫెషనల్ కౌన్సెలర్లను నియమించాలి. పరీక్షలు అనేవి జీవితంలో ఒక భాగం మాత్రమే తప్ప, అవే జీవితం కాదని విద్యార్థులకు నిరంతరం ధైర్యం చెప్పాలి. మార్కుల కంటే ప్రాణం విలువైనదని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాలి. విద్యార్థుల ప్రవర్తనలో ఏవైనా మార్పులు కనిపిస్తే వెంటనే వారిని ప్రేమతో పలకరించి, భరోసా ఇవ్వాలి. విద్యా సంస్థల మధ్య ఉన్న అనారోగ్యకరమైన పోటీని అరికట్టడానికి ప్రభుత్వం ర్యాంకుల ప్రచారాలపై కఠినమైన ఆంక్షలు విధించాల్సిన అవసరం ఉంది.

### మార్పు దిశగా ముందడుగు

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలి. కేవలం ఉద్యోగాల కోసమే చదువు అనే ధోరణి వీడాలి. విద్యార్థిలోని ప్రత్యేక నైపుణ్యాన్ని గుర్తించి, దానిని ప్రోత్సహించేలా విద్యా విధానం ఉండాలి. ఒకరు క్రీడల్లో, ఒకరు కళల్లో, మరొకరు స్వయం ఉపాధిలో రాణించవచ్చు అనే సత్యాన్ని సమాజం అంగీకరించాలి. ఒకే ఒక్క పరీక్షతో విద్యార్థి భవిష్యత్తును నిర్ణయించే పద్ధతి మారాలి. అప్పుడే విద్యార్థులు ఒత్తిడి లేని వాతావరణంలో స్వేచ్ఛగా చదువుకోగలరు. పసి ప్రాణాలు బలి లేని, ఆనందకరమైన చదువుల కోసమే మనందరి పోరాటం కావాలి.

# యూపీఐ లావాదేవీల ద్వారా రూ.14.77 లక్షల లంచం స్వీకరణ

- సూపరింటెండెంట్ అరెస్ట్
- కరీంనగర్‌లో అవినీతి నిరోధక శాఖ చర్యలు
- బినామీ ఖాతా ద్వారా డబ్బులు తీసుకున్న అధికారిపై కేసు

**వేద న్యూస్, కరీంనగర్**




కరీంనగర్‌లోని జాయింట్ డైరెక్టర్ వర్క్స్ అకౌంట్స్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఈగల మధుసూదన్‌ను తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అధికారిక పనుల కోసం లంచాలు డిమాండ్ చేసి స్వీకరించినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. సెప్టెంబర్ 15, 2022 నుంచి సెప్టెంబర్ 20, 2023 వరకు జరిగిన లావాదేవీలపై విచారణ జరిపిన తర్వాత ఈ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఈగల మధుసూదన్ మొత్తం రూ.14,77,003 లంచాలు డిమాండ్ చేసి యూపీఐ లావాదేవీల ద్వారా స్వీకరించినట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు గుర్తించారు. ఈ డబ్బును భద్రాద్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌లో ఉన్న బినామీ ఖాతా ద్వారా స్వీకరించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ సేవలను అందించడంలో తన అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు అధికారులు తెలిపారు. పరిశీలన మరియు ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్న ఫైళ్లలో ఉన్న లోపాలను దాచడం లేదా సవరించడం వంటి అధికారిక సహాయాలు అందించేందుకు మధుసూదన్ లంచాలు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. అధికారిక ప్రయోజనాలను కల్పించేందుకు ఇలా అవినీతి చర్యలకు పాల్పడినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేసి మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారంతో ఈ కేసును బయటపెట్టినట్లు వెల్లడించారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినా ప్రజలు వెంటనే అవినీతి నిరోధక శాఖను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫోన్ చేయాలని తెలిపారు. అలాగే వాట్సాప్ నెంబర్ 9440446106, ఫేస్‌బుక్ మరియు అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలిపారు.

# అభివృద్ధి దిశగా ప్రజా ప్రభుత్వం

- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం
- ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం
- సంక్షేమం, అభివృద్ధి, పాలనా సంస్కరణలపై ప్రభుత్వ రోడ్ మ్యాప్ ఆవిష్కరణ



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధి స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశగా రాష్ట్రం ఐకమత్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, భవిష్యత్తు లక్ష్యాలను సవివరంగా సభ ముందు వివరించారు. ఆవిష్కరణల్లో అగ్రగామిగా, బలహీన వర్గాలకు భరోసాగా, ప్రపంచానికి ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాష్ట్రంగా తెలంగాణను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ రైజింగ్–2047 విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గవర్నర్ తెలిపారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో వివిధ రంగాల్లో సంస్కరణలు చేపట్టినట్లు చెప్పారు. నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరచడం, వ్యవసాయ ఉత్పాదకత పెంచేందుకు పెట్టుబడి సాయం అందించడం, రైతు సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పునర్వ్యవస్థీకరించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించినట్లు తెలిపారు. వేగంగా పెరుగుతున్న నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని పునర్వ్యవస్థీకరించామని చెప్పారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ

- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేయాలి
- ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై చర్యలు తీసుకోవాలి
- సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



క్యూర్ పరిధిలో మొదటి విడతగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మరియు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులపై విస్తృతంగా చర్చించారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో పేదలకు గృహ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో పూర్తిగా పారదర్శకత ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్లను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ మరియు ఇతర గృహ పథకాల కింద ఇళ్లు పొందిన వారు వాటిలో నివసించకుండా అద్దెకు ఇస్తున్న లేదా ఖాళీగా ఉంచుతున్న పరిస్థితులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారికి నోటీసులు జారీ చేసి స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. స్పందించిన వారితో ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా అండర్‌టేకింగ్ తీసుకోవాలని సూచించారు. క్యూర్ పరిధిలోని కాలనీల్లో విద్యుత్, తాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని మంత్రి పేర్కొన్నారు. ఈ విషయంలో జీహెచ్ఎంసీ సహకారం తీసుకోవాలని సూచించారు. అలాగే అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ టవర్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తయిన వాటిని వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఎండీ వీపీ గౌతమ్, నాలుగు జిల్లాల కలెక్టర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 17, 2026

# హనుమాన్ మాల ధరించిన విద్యార్థులు

- స్కూల్లోకి ప్రవేశం నిరాకరణ
- మెట్‌పల్లిలో ఉద్రిక్తత
- పాఠశాల ఎదుట హనుమాన్ భక్తుల ధర్నా





**వేద న్యూస్, మెట్‌పల్లి:**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పట్టణంలోని నిఖిల్ భారత్ స్కూల్ వద్ద హనుమాన్ మాలలో ఉన్న విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించకపోవడంతో హనుమాన్ భక్తులు నిరసనకు దిగారు. పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు హనుమాన్ మాల ధరించి రావడంతో స్కూల్ యాజమాన్యం వారిని లోపలికి అనుమతించలేదు. పాఠశాల నియమ నిబంధనలు ఉన్నాయని పేర్కొంటూ 21 రోజుల పాటు పాఠశాలకు రావద్దని యాజమాన్యం సూచించినట్లు సమాచారం. అలాగే విద్యార్థుల నుంచి లీవ్ లెటర్ కూడా రాయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై హనుమాన్ దీక్షలో ఉన్న స్వాములు, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తూ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలిసిన వెంటనే పెద్ద సంఖ్యలో హనుమాన్ స్వాములు పాఠశాల వద్దకు చేరుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మిత్రుని కుటుంబానికి అండగా చిన్ననాటి స్నేహితులు

**వేద న్యూస్, చందుర్తి:**



చందుర్తి మండల కేంద్రానికి చెందిన రాజూరి వీరచారి ఇటీవల మృతి చెందగా అతని కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చందుర్తిలో 1997-98 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన బ్యాచ్‌కు చెందిన స్నేహితులు తమ మిత్రుడి కుటుంబానికి బాసటగా నిలుస్తూ మేమున్నామంటూ ధైర్యం చెప్పారు. వీరచారి మృతితో దుఃఖంలో ఉన్న కుటుంబానికి సహాయం అందించేందుకు స్నేహితులు ముందుకు వచ్చి అంత్యక్రియల మొదటి రోజు ఖర్చుతో పాటు ఐదు రోజుల కార్యక్రమానికి సరిపడే సరుకులను అందజేశారు. తమ చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. వీరచారి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు స్నేహితుల ఈ ఔదార్యాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. చిన్ననాటి స్నేహితుల సహాయం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

# ముస్లిం పేద కుటుంబాలకు తోఫా పంపిణీ

**వేద న్యూస్, మహబూబాబాద్:**



పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ పట్టణంలో ముస్లిం పేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మహ్మద్ ఫరి ద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన బాల్య మిత్రుడు జొన్నలగడ్డ భాను ప్రకాష్ రాధికా దంపతులు (ఎన్ఆర్ఐ) ఆర్థిక సహకారం అందించారు. "రంజాన్ తోఫా" పేరుతో సుమారు 100 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగకు అవసరమైన నిత్యావసర సరుకులను అందజేశారు. దీంతో పేద కుటుంబాలు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకునేందుకు సహాయపడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ డోలి సత్యనారాయణ, కెఎస్ఎన్ రెడ్డి, బోడ్డుపల్లి ఉపేందర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైనదని, ఈ పవిత్ర మాసంలో ఖుర్ఆన్ అవతరించిందని పేర్కొన్నారు. రంజాన్ మాసం మనుషుల్లో క్రమశిక్షణ, సహనం, దానం, పరస్పర ప్రేమ, దయ వంటి గొప్ప విలువలను పెంపొందిస్తుందని తెలిపారు. ఈ పవిత్ర మాసంలో పేదలకు సహాయం చేయడం, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం సమాజంలో ఐక్యతను పెంపొందించే గొప్ప సేవ అని అభిప్రాయపడ్డారు. భాను ప్రకాష్- రాధికా దంపతులు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు ప్రశంసించారు. మతభేదాలు లేకుండా మానవత్వం, పరస్పర సహకారం, సామాజిక బాధ్యత ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం మరోసారి గుర్తు చేసిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాల్యమిత్రులు మొహమ్మద్ ఇస్మాయిల్, మొహమ్మద్ నయీమ్, బీఆర్ఎస్ నాయకులు దుగ్గి రాంగోపాల్, మహ్మద్ రఫిఖ్, జన్నె నవీన్, సట్ల రాజు, సయ్యద్ పాషా, దుగ్గి కార్తిక్, సరోజన, రజాక్, ఖాజవలి, అజ్గర్, కలీం తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లి డివిజన్‌లో తెలుగు ప్రతిభ పరీక్ష

- మార్చి 17న నిర్వహణ
- విద్యార్థులకు సువర్ణావకాశం



**వేద న్యూస్, మెట్‌పల్లి ప్రతినిధి:**

మెట్‌పల్లి డివిజన్ తెలుగు ఫోరం ఆధ్వర్యంలో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలకు చెందిన విద్యార్థుల కోసం తెలుగు ప్రతిభ పరీక్ష - 2026 నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగు భాషపై విద్యార్థుల ఆసక్తి పెంపొందించడం, వారి భాషా నైపుణ్యాలను వెలికితీయడం లక్ష్యంగా ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష మార్చి 17వ తేదీ ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల (జీజేసీ)లో జరగనుంది. పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాలుగా నిర్వహించనున్నారు. జూనియర్ విభాగంలో 6, 7 తరగతుల విద్యార్థులు, సీనియర్ విభాగంలో 8, 9 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చు. ప్రతి పాఠశాల నుంచి ఒక్కో విభాగంలో ఒక విద్యార్థిని ఎంపిక చేసి పంపించాల్సి ఉంటుంది. సిలబస్‌లో కవి పరిచయాలు, పదజాలం, భాషాంశాలు ఉండగా ప్రశ్నలు బహుళైచ్ఛిక విధానంలో ఉంటాయని తెలిపారు. డివిజన్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. అలాగే ప్రతి మండలం నుంచి ఇద్దరు టాపర్లకు ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికేట్ అందజేయబడుతుందని తెలిపారు. జెడ్పీ హెచ్ఎస్, యూపీఎస్, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు మాత్రమే ఈ పరీక్షలో పాల్గొనవచ్చని, ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులను తెలుగు ఉపాధ్యాయులు తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు. పరీక్షా పత్రాలను ఇతర మండలాలకు చెందిన నిపుణులు అత్యంత గోప్యంగా సిద్ధం చేస్తారని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు మధ్యాహ్నం భోజన వసతి కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి డీఈఓ, ఎంఈఓల పూర్తి అనుమతి ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. "తెలుగు భాషను కాపాడుకుందాం మన ప్రతిభను చాటుకుందాం" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెట్‌పల్లి డివిజన్ తెలుగు ఫోరం సభ్యులు సొప్పరి శ్రీనివాస్, విజయసేన్, నవీన్, సత్యనారాయణ, తిరుపతి నాయక్, నళిన్ కుమార్, హరి, కవిత, భూలక్ష్మి తెలిపారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

- ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- జిల్లా అడ్మినిస్ట్రేషన్ - ట్రెజరరీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**వేద న్యూస్, హనుమకొండ:**



హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం జిల్లా ఖజానా శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. థలసీమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సహాయంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు చాహత్ బాజ్ పాయ్ హాజరై రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రక్తదానం మానవత్వానికి చేసే గొప్ప సేవ అని అన్నారు. ఒక యూనిట్ రక్తం అనేక మంది ప్రాణాలను కాపాడగలదని, ముఖ్యంగా థలసీమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తం ప్రాణాధారమని తెలిపారు. వేసవి కాలంలో రక్త బ్యాంకుల్లో కొరత ఎక్కువగా ఉండే నేపథ్యంలో యువత, సేవా సంస్థలు ముందుకు వచ్చి రక్తదాన శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, బిళ్ళ రమణారెడ్డి, జిల్లా ఖజానా శాఖ అధికారి అకవారం శ్రీనివాస్ కుమార్, టీఎన్‌జీవో ప్రెసిడెంట్ ఆకుల రాజేందర్, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ రావు, ఉద్యోగ సంఘాల నాయకులు మరియు ఖజానా శాఖ సిబ్బంది పాల్గొన్నారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేసి శిబిరాన్ని విజయవంతం చేశారు.

# క్రీడా సామగ్రిపై పట్టింపేది?

- అలంకారప్రాయంగానే పరికరాలు ఉండాలా?
- ప్రమాదకర మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డు ఏది?
- 99 రోజుల ప్రణాళికలో సమస్యలు పరిష్కరించాలి:ప్రజలు



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండల పరిధిలోని గడ్డివానీపల్లి గ్రామంలో పరిపాలన తీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. కనీస మౌలిక వసతుల కల్పన, నిర్వహణపైన గ్రామ ప్రథమ పౌరుడు దృష్టి సారించాలని జనం కోరుతున్నారు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పరిస్థితి ఉందని, మార్పు రావాలని కోరుతున్నారు. గ్రామంలో కి ప్రవేశించే క్రమంలో గ్రామపంచాయతీ ఆఫీస్ ఎదుట రోడ్డు వద్ద గుంతలు ఉండటమే కాకుండా.. గ్రామంలోకి ప్రవేశించే మూలమలుపు వద్ద కనీస హెచ్చరిక బోర్డు లేకపోవడం తో ప్రమాదాలు పొంచి ఉండే అవకాశాలు లేకపోలేదు. కనీసంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు తోపాటు మూలమలుపు వద్ద వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపును తక్షణమే చేయించాలని వాహనదారులు కొందరు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో ఎవరైనా కొత్తవారు వస్తే.. ప్రమాదం జరిగేలా మలుపులు ఉన్నాయని చెబుతున్నారు.

**బోర్డు కనిపిస్తలే!?**

గడ్డివానిపల్లి గ్రామపంచాయతీ పరిపాలన కార్యాలయ సమీపంలో ఉన్న



తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం బోర్డు కనీసం కనిపించకపోవడం గమనార్హం. ఇక గ్రామీణ క్రీడా ప్రాంగణంగా పేర్కొనబడే సదరు ప్రదేశంలో.. క్రీడా సామగ్రి తుప్పు పడుతున్నా పట్టించుకొనే నాథుడు లేడని స్పష్టమవుతున్నది. రూ. లక్షలు విలువ చేసే పరికరాలను సమకూర్చిన క్రీడా ప్రాంగణం అలంకారప్రాయంగా ఉండటం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాలకవర్గం ఈ విషయమై దృష్టి సారించాలని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామ యువత, ప్రజలు క్రీడా ప్రాంగణమును సద్వినియోగం చేసుకునే విధంగా గ్రామ ప్రథమ పౌరుడి సూచనలు ఉంటే బావుంటుందని, ఆ దిశగా కార్యాచరణ ఉంటే గ్రామస్తులకు ఆరోగ్యంతో పాటు ప్రభుత్వం ఒక లక్ష్యంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణము వినియోగంలోకి వస్తుందని వెల్లడిస్తున్నారు. ఇక గ్రామంలో మురుగు నిర్వహణ డ్రైనేజీ తరలింపునకు ఉన్న సైడ్ కాలువలు, కొన్నిచోట్ల అలాగే నిండి ఉండిపోయాయి. సైడ్ కాలువలు ఓ చోట మధ్యలో కట్ అయినట్టు గా ఉన్నాయి. గ్రామపంచాయతీ ఆఫీసు ఎదుటే గుంతలు ఉండటం, గ్రామానికి వెళ్లే రోడ్డు లో కొన్ని చోట్ల గుంతలు పడి ఉండగా, తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కొందరు వెల్లడిస్తున్నారు. ప్రస్తుత 99 రోజుల ప్రణాళికలో భాగంగా.. పాలకవర్గం పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని, ప్రజలు కోరుతున్నారు. పరిశుభ్రత పచ్చదనం, పారిశుద్ధ్య నిర్వహణ తోపాటు గ్రామ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ను చేపట్టగా, గ్రామ పరిధిలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉన్న సమస్యలన్నిటిని పరిష్కరిస్తే... బాగుంటుందని, తద్వారా మాత్రమే ప్రజా పాలన జరిగినట్టుగా భావించాల్సి ఉంటుందని ప్రజలు అభి ప్రాయ పడుతున్నారు. గ్రామ సమస్యల పరిష్కారం కోసం గ్రామ ప్రథమ పౌరుడు తప్పనిసరిగా కృషి చేయాల్సిన బాధ్యత ఉందని పలువురు పేర్కొంటున్నారు.

# గ్యాస్ సిలిండర్‌కు పూలదండలతో నిరసన

**వేద న్యూస్, నల్లబెల్లి:**



గ్యాస్ ధరల పెంపు, సరఫరాలో కొరతపై నిరసన వ్యక్తం చేస్తూ నల్లబెల్లి మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో గ్రామస్తులు వినూత్న నిరసన చేపట్టారు. నల్లబెల్లి బస్టాండ్ సెంటర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో గ్యాస్ సిలిండర్లకు పూలదండలు వేసి, కట్టెల పొయ్యిపై వంట చేస్తూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యుద్ధాలను ఆసరాగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూరుస్తోందని ఆరోపించారు. పెరిగిన ధరల వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్యాస్ ధరలు తగ్గించడంతో పాటు సరఫరాలో ఉన్న కొరతను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధరల పెంపు కారణంగా చాలా మంది ఇంటి వంటలను కూడా ఆపేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చింతకింది కుమారుస్వామి అన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో సామల దేవేందర్, క్రాంతి, వైనాల వీరస్వామి, సారంగం, రవి, శ్రీహరి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 17, 2026

## వీరభద్ర స్వామి విగ్రహం తొలగింపుపై ఫిర్యాదు




**వేద న్యూస్, హైదరాబాద్:**

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ గ్రామంలోని మెట్టు రామలింగేశ్వరస్వామి దేవాలయానికి చెందిన ప్రాచీన వీరభద్ర స్వామి విగ్రహం అక్రమంగా తొలగించిన ఘటనపై దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. సోమవారం హైదరాబాద్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన "ధర్మవాణి" కార్యక్రమంలో రాష్ట్రీయ హిందూ పరిషత్ దేవాలయ పరిరక్షణ సమితి వరంగల్ జిల్లా కన్వీనర్ పల్లపు అశోక్ కమిషనర్ ఎం. హనుమంత రావును కలిసి ఈ విషయంపై అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పల్లపు అశోక్ మాట్లాడుతూ మడికొండలోని శ్రీ మెట్టు రామలింగేశ్వరస్వామి దేవాలయానికి చెందిన చారిత్రక ప్రాముఖ్యత కలిగిన వీరభద్ర స్వామి విగ్రహాన్ని అక్రమంగా తొలగించి విక్రయించారని ఆరోపించారు. దేవాలయ ఆస్తిగా, హిందూ సమాజానికి పవిత్రమైన ఈ విగ్రహానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు పురావస్తు విలువ కూడా ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి ఇందులో ప్రమేయం ఉన్న అర్చకుడు, అప్పటి ఈఓలపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. అక్రమంగా విక్రయించబడిన విగ్రహాన్ని తిరిగి దేవాలయానికి తీసుకురావాలని కూడా ఫిర్యాదులో కోరినట్లు చెప్పారు. ఈ అంశానికి సంబంధించిన ఆధారాలు, పత్రాలను కమిషనర్ కార్యాలయానికి సమర్పించినట్లు తెలిపారు. సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖ కమిషనర్ హామీ ఇచ్చినట్లు పల్లపు అశోక్ వెల్లడించారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని వినతి



**వేద న్యూస్, కోటగిరి :**

కోటగిరి మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటివరకు హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రం లోని రాణంపల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా 98 ఆవులు, గేదెలకు టీకాలు వేయడం జరిగిందని పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండలవాడి శంకర్, పశువైద్య సిబ్బంది, పశువుల పెంపకం దారులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రామాలయ హుండీ లెక్కింపు పూర్తి

**– ఆదాయం రూ.3,85,202**



**వేద న్యూస్ , ఇల్లందకుంట:**

దేవాదాయ ధర్మాదాయ శాఖ కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం, గ్రామం నందుగల సీతారామచంద్రస్వామి దేవస్థానములో సోమవారం "హుండీ లెక్కింపు" నిర్వహించారు. 06/09/2025 నుండి సోమవారం వరకు అనగా 6 నెలల 10 రోజులకు గాను రూ.3,85,202 ఆదాయం వచ్చినదనీ ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలె రామారావు తెలిపారు. సదరు "హుండీ లెక్కింపు" పరిశీలకులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ, కరీంనగర్ డివిజన్ పి సత్యనారాయణ వారి పర్యవేక్షణలో కె సుధాకర్, కార్యనిర్వహణాధికారి, ఆలయ కమిటి చైర్మెన్ ఇంగిలే రామారావు & కమిటి సభ్యులు పాల్గొన్నారు. సదరు హుండీ లెక్కింపులో ఆలయ అర్చకులు శేషం వంశీధరాచార్యులు, మడికొండ నవీన్ కుమార్ శర్మ, సిబ్బంది మల్లారెడ్డి, సురేందర్ రావు, ప్రవీణ్, రమేష్, రాజేందర్, శ్రీరాజరాజేశ్వరీ సేవా సమితి సభ్యులు- జమ్మికుంట వారు పాల్గొన్నారు.

# మసీదుకు మైక్ సెట్ బహూకరణ



**వేద న్యూస్, జమ్మికుంట:**

దారు సలాం మసీదులో ముస్లిం పెద్దలకు నూతన మైక్ సెట్ ను 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు సోదరీమణులు పవిత్రమైన ఉపదీక్షలు ఉంటారనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీలో కులమతాలకు అతీతంగా అందరం కలిసి మెలిసి పండుగలు చేసుకుంటాం అని చెప్పారు. అనంతరం మసీద్ పెద్దలు శ్రీపతి స్వర్ణలత నరేష్ ను శాలువా దండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

**– మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్**



**వేద న్యూస్, మంథని:**

మంథని మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని 11వ వార్డు గాంధీ చౌక్‌లో గాంధీ చౌక్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్ ఎల్లంకి వంశీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. అవినీతి రహిత పాలన అందిస్తామని, ఇంటి పర్మిషన్లు లేదా ఇతర పనుల కోసం ఎవరూ మున్సిపల్ అధికారులు లేదా కౌన్సిలర్లకు డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. గాంధీ చౌక్ ప్రాంతం నుంచి తన రాజకీయ జీవితం ప్రారంభమైందని, ఈ ప్రాంత ప్రజలు తనకు కుటుంబ సభ్యుల్లా మద్దతు ఇచ్చారని అన్నారు. గాంధీ చౌక్ గణేష్ ఉత్సవ సమితి భవనానికి బోర్ బావి మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే రాబోయే వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు గాంధీ చౌక్‌లో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించి ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ చౌక్ ఉత్సవ సమితి సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో లైబ్రరీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

**– సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంతో పాటు అన్ని మండలాల గ్రామాల్లో గ్రామ పంచాయతీల అనుసంధానంతో లైబ్రరీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. గ్రామాల్లో లైబ్రరీలు ఏర్పాటు చేస్తే విద్యార్థులు పుస్తకాల ద్వారా విజ్ఞానం పెంపొందించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులకు ఇస్తున్న ప్రాధాన్యతను విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడే లైబ్రరీ వ్యవస్థకు ఇవ్వడం లేదని ఆయన విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తరువాత కూడా గ్రామాల్లో సరైన లైబ్రరీలు ఏర్పాటు కాకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించి గ్రామాల్లో లైబ్రరీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తకాల ద్వారా మంచి విజ్ఞానం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు

# బొందల గడ్డను కబ్జా కాకుండా కాపాడాలి

**– దూషించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

**– కలెక్టరేట్లో నాయీ బ్రాహ్మణుల ఫిర్యాదు**




**వేద న్యూస్, ములుగు:**

సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొక్కొండ గ్రామంలో నాయి బ్రాహ్మణులకు చెందిన బొందల గడ్డను కబ్జా చేయకుండా కాపాడాలని, అలాగే కులం పేరుతో దూషించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయిబ్రాహ్మణ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్వాల్ యాదనరేందర్ ఆధ్వర్యంలో కొక్కొండ, కొత్తూర్ గ్రామాలకు చెందిన నాయిబ్రాహ్మణులు జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యాద నరేందర్ మాట్లాడుతూ కొక్కొండ గ్రామంలో నాయిబ్రాహ్మణులకు చెందిన బొందల గడ్డను కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ విషయంలో దోమకొండ బాలేష్‌తో పాటు సర్పంచ్ విజయలక్ష్మి భర్త వాసు గౌడ్, మురాడి బాబు, తలారి మల్లేశ్‌లు కులం పేరుతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ ఫిర్యాదులో జంపాల మల్లేశ్, జంపాల రవి, ఆంజనేయులు, నరేష్, నవీన్, క్రాంతికుమార్, వినోద తదితరులు పాల్గొన్నారు.

# హామీలు వెంటనే అమలు చేయాలి

**– తహసీల్దార్‌కు బీజేపీ నేతల మెమోరాండం**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ సూచన మేరకు సోమవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కరీంనగర్ జిల్లా కోశాధికారి వైద రామానుజం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాకపోవడం బాధాకరమని అన్నారు. యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, రైతులకు రైతు భరోసా, అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు, పేదలకు ఇళ్ల పథకం వంటి హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. మండలంలో రైతులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే నివాస, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జారీ విషయంలో కూడా జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. అధికారులు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల హక్కుల కోసం బీజేపీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, పసికంటి వెంకటేశం, కొనుకటి హరీష్, మెరుపుల గంగాధర్, రమేష్, సారంపల్లి రాజు, కిరణ్, భాస్కర్ రెడ్డి, మహేష్, అనిల్, రజనీకాంత్, అంజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేష్‌కు బిజినెస్ ఎంటర్‌టైనర్ అవార్డు




**వేద న్యూస్, మంథని:**

మంథని పట్టణానికి చెందిన ఎస్వీఆర్ ఫోటో ఫ్యాక్టరీ అధినేత డా. వేల్పుల వెంకటేష్ 'ఏ వన్ మీడియా బిజినెస్ ఎంటర్‌టైనర్ అవార్డ్ - 2026'ను అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సింగర్, డైరెక్టర్ రఘు కుంచే, నటుడు రచ్చ రవి చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. ఉత్తమ బిజినెస్‌మాన్‌గా వెంకటేష్‌కు ఈ అవార్డు లభించడం పట్ల మంథని పట్టణానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# హరీష్ రావుకు ఆ స్థాయి లేదు

**– రాహుల్ గాంధీ టీం నాయకుడు అల్వాల ధర్మయ్య**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, రాహుల్ గాంధీ టీం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్వాల ధర్మయ్య మాజీ మంత్రి హరీష్ రావుపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి హరీష్ రావుకు లేదని ఆయన అన్నారు. దేశానికి భావి ప్రధానిగా భావిస్తున్న రాహుల్ గాంధీ ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలపై పార్లమెంట్‌లో నిరంతరం పోరాడుతున్న నాయకుడని ధర్మయ్య పేర్కొన్నారు. అలాంటి నాయకుడిపై అనవసర వ్యాఖ్యలు చేయడం తగదని, భవిష్యత్తులో రాహుల్ గాంధీ గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హరీష్ రావును హెచ్చరించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అనేక మోసాలు చేసిందని ఆరోపిస్తూ ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజలకు నిజాలు తెలిసే సమయం వచ్చిందని, కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటాన్ని కొనసాగిస్తుందని అల్వాల ధర్మయ్య తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోస్టర్ ఆవిష్కరణ

**– ఐడీఓసీలో ఆవిష్కరించిన కలెక్టర్**



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సుల వివరాలతో రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో కలిసి బీఎస్సీ, బీకాం, బీఏ తదితర కోర్సుల వివరాలతో సిద్ధం చేసిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో దోస్త్ వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్ల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. శంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, అడ్మిషన్ ఇన్‌చార్జి జి. శ్రీధర్ రావు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ. ప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శోభారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ కే. శారద, డాక్టర్ కే. వై. కరుణ, ఆఫీస్ ఇన్‌చార్జి గోపికృష్ణ, రమేష్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఆర్మీ జవాన్



**వేద న్యూస్ , వీణవంక:**

వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల శ్రీరామ్‌కు కొంతకాలం క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే, చికిత్స కోసం ఇప్పటికే దాదాపు రూ. 12 లక్షల వరకు ఖర్చు కావడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. సాధారణ పరిస్థితుల్లోనే జీవనం సాగించే ఈ కుటుంబానికి వైద్య ఖర్చులు భారంగా మారాయి. ఈ విషయం తెలుసుకున్న జమ్మికుంట మండలం కొరపెల్లి గ్రామానికి చెందిన ఇండియన్ ఆర్మీ జవాన్ గుండబోయిన రమేష్ యాదవ్ మానవత్వం చాటుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు స్వయంగా వారి ఇంటికి వెళ్లి, నేరెళ్ల శ్రీరామ్‌కు తన వంతుగా రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రీరామ్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో దాతలు ముందుకు వచ్చి సహాయం అందించాలని కోరారు. రమేష్ యాదవ్ చూపిన మానవత్వానికి గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. కష్టసమయంలో సహాయం చేసి ఆర్మీ జవాన్ గొప్ప మనసు చూపారని ప్రశంసించారు.

# ఉపాధి కల్పించకపోతే చావే శరణ్యం

**– ప్రజావాణిలో వికలాంగుడి ఆవేదన**




**వేద న్యూస్, వేములవాడ:**

ఉపాధి కల్పించకపోతే ఆత్మహత్యే శరణ్యం అంటూ వేములవాడకు చెందిన ఓ వికలాంగుడు ప్రజావాణిలో తన ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వేములవాడ పట్టణానికి చెందిన ఓదెల నరేష్ ప్లకార్డుతో నిరసన తెలుపుతూ తన సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చాడు. పుట్టుకతోనే వికలాంగుడైన నరేష్ గత కొన్నేళ్లుగా జీవనోపాధి లేదా ఉద్యోగం కల్పించాలని కోరుతూ అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపాడు. గత ప్రభుత్వ హయాంలో కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు వందలాది దరఖాస్తులు ఇచ్చినా ఎవరూ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుత ప్రభుత్వం అయినా తన పరిస్థితిని గమనించి ఉపాధి కల్పించాలని కోరుతూ ప్రతి సోమవారం ప్రజావాణికి వస్తున్నట్లు పేర్కొన్నాడు. అధికారులు కేవలం దరఖాస్తులు స్వీకరించడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆరోపించాడు. తన సమస్యను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని జీవనోపాధి కల్పించాలని, లేకపోతే తనకు ఆత్మహత్య తప్ప మరో మార్గం కనిపించడం లేదని నరేష్ వేదన వ్యక్తం చేశాడు.

# మార్కెట్ వేలం పాట ఆదాయం రూ. 6.55 లక్షలు



**వేద న్యూస్, పాపన్నపేట :** పాపన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం తైబజారుకు అధికారులు వేలం పాట నిర్వహించారు. రూ. 6.55.000 లకు దున్న శివ గౌడ్ అధిక ధర పలికి ఈ హక్కుని దక్కించుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీవో శ్రీశైలం,గ్రామపంచాయతీ కార్యదర్శి నయీమ్,సర్పంచ్ పావని నరేందర్ గౌడ్,ఉప సర్పంచ్ సద్దామ్ హుస్సేన్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలు కాంగ్రెస్ నెరవేర్చాలి

**– బిజెపి ఆధ్వర్యంలో నిరసన**

**– తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పణ**



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో బిజెపి మండలాధ్యక్షుడు బైరెడ్డి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ వైఫల్యాల విషయాలను తెలియపరిచా రు. ప్రభుత్వం నిరుద్యోగులకు యువతి యువకులకు హామీలను విస్మరించడం జరిగిందని,అర్హులైన ఇల్లు లేని పేదలకు ఇల్లు మంజూరు చేయాలని, వితంతు వృద్ధులకు పింఛన్లు,రైతులకు రైతు భరోసా సన్నవడ్లకు బోనస్ సకాలంలో చెల్లించాలని, రుణమాఫీ సంపూర్ణంగా నిర్వహించాలని కోరారు .ప్రభుత్వం ప్రకటించిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లకు రూ. 1,00,116లతో పాటు తులం బంగారం ఇవ్వాలని, అర్హులైన మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ. 2,500 చెల్లించాలని కోరారు. కార్యక్రమం లో ఇల్లందకుంట మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు గుత్తికొండ రాంబాబు,ఉప్పుల రమేష్, కొత్త శ్రీనివాస్,ఇంగ్లే ప్రభాకర్,బొమ్మాడి శ్రీధర్ రెడ్డి,తాళ్ల పాపిరెడ్డి, రేణుకుంట్ల కుమార్, మురహరి గోపాల్,ఉప్పు దుర్గయ్య,సామ కర్ణాకర్ రెడ్డి, తుపాకుల సతీష్, పిట్టల రాజు, పలకల కిషన్ రెడ్డి, చిట్ల శ్రీనివాస్, చింతల ఐలయ్య, గుత్తికొండ పవన్,నాగపూరి వంశీ, మాదాసు మొగిలి,ఎలావేణి శ్రీధర్, రాంబాబు,శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు

**– నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**– డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. రాజిత**



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఎస్. రాజిత ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేంద్రబాబు కూడా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేడియాలజిస్టులకు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు అధికారులు పలు సూచనలు చేశారు. ప్రతి రేడియాలజిస్ట్ కేవలం రెండు ఆసుపత్రుల్లో మాత్రమే స్కానింగ్ సేవలు అందించాలని తెలిపారు. ఫారంఎఫ్ ఆడిట్ నిర్వహణలో గర్భిణీ స్త్రీల రిఫరల్ స్లిప్పులు, స్కానింగ్ ఫిలింలను తప్పనిసరిగా జతపరచాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌లో ఉన్న మిషన్ నంబర్, ప్రస్తుతం వినియోగిస్తున్న స్కానింగ్ మిషన్ నంబర్ సరిపోలాలని సూచించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం లింగ నిర్ధారణకు పాల్పడితే రూ. 10 వేల జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ రాజిత తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంఓ రాజకుమార్‌తో పాటు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు రుణమాఫీ, రైతు భరోసా తక్షణమే విడుదల చేయాలి



**వేద న్యూస్, పాపన్నపేట :**

రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా తక్షణమే విడుదల చేయాలని భాజాపా మండల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భాజాపా రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు తెలంగాణ వ్యాప్తంగా అన్ని మండల తహసిల్దార్ కార్యాలయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ప్రజా సమస్యలపై మండల పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కు మెమోరండం అందించారు. పార్టీ మండల అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి మాట్లాడుతూ... కేంద్రం నుండి యూరియా విరివిగా వస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వాన్ని బదనాం చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం యూరియా కృత్రిమ కొరత సృష్టించడం జరిగిందని, దాన్ని బిజెపి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, దాని ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న అన్ని రకాల వితంతు, వృద్ధాప్య, వికలాంగ, వివిధ రకాల పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శంకరయ్య, చంద్రయ్య, లక్ష్మణ్, బొక్కల భాగేష్, కోళ్ల మల్లేశం, మైనార్టీ మోర్చా అధ్యక్షులు గౌస్, ఓబిసి మోర్చా వడ్ల భాగేష్, మండల నాయకులు సంతోష్ గౌడ్, మల్లేశం, దుర్గయ్య, పెంటయ్య, నర్సింలు, బాబు తదితరులు పాల్గొన్నారు.

# బలవంతంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

**– డిఎస్పి ప్రసన్నకుమార్**



**వేద న్యూస్, పాపన్నపేట :**

ట్రాన్స్ జెండర్లు ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని, శుభకార్యాలకు వెళ్లి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ హెచ్చరించారు. సోమవారం పాపన్నపేటలోని మంజీరా గార్డెన్స్ లో సారా ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీలో అందరూ భాగస్వాములే అని, వివిధ గ్రామాలు, ఏడుపాయల్లో శుభ కార్యాలలో ఇష్టారీతిన డబ్బులు డిమాండ్ చేయవద్దన్నారు. ఏడుపాయలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో పెండ్లిలు, గృహప్రవేశాలతో పాటు ఇతర శుభకార్యాలకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తూ వీరంగం సృష్టిస్తున్నట్లు తమకు సమాచారం ఉందని అన్నారు. పండగ వాతావరణం కాస్త డిస్టర్బ్ చేస్తూ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇకముందు శుభకార్యాలలో కానీ ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గౌరవంగా ప్రవర్తించని యెడల చట్టం పరంగా చర్యలు ఉంటాయన్నారు. జిల్లా సంక్షేమ అధికారిణి హేమాభార్గవి, సీఐ జార్జి, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



**వేద న్యూస్, పోతంగల్ :**

పోతంగల్ మండలంలోని టాక్లి గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పద్మావతి ప్రారంభించారు. గ్రామంలోని ఆవు, గేదె జాతి మూడు నెలల పైన వయసుగల పశువులకు ఉచిత గాలుకుంటూ వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేయడం జరిగిందని పశు వైద్యులు డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చందర్, పశు వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# ధ్యానంతో ప్రశాంతమైన జీవితం

- మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని
- బ్రహ్మకుమారి సంస్థ సేవలు అభినందనీయం
- బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది వేడుకలు



**వేద న్యూస్ , హుజురాబాద్:**

ప్రపంచ శాంతి కోసం బ్రహ్మకుమారి సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని, ఆ సంస్థ అందిస్తున్న రాజయోగ ధ్యానాన్ని ఆచరిస్తే ప్రశాంతమైన జీవితం పొందవచ్చని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన చైర్పర్సన్ మాట్లాడుతూ... రాజయోగ ధ్యానం, ఆధ్యాత్మిక విద్య ద్వారా వ్యక్తిగత పరివర్తన, ప్రపంచ శాంతి కోసం బ్రహ్మకుమారి సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రాజయోగ మెడిటేషన్ ద్వారా మనసుకు ప్రశాంతత దొరుకుతుందన్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి సహజం అని, ఫలితంగా చిరాకు, విసుగు, అనాసక్తత ఆవరించి జీవన నాణ్యత దెబ్బతింటుందన్నారు. వీటిని వదిలించుకోవాలంటే మానసిక ప్రశాంతత చేకూర్చుకోవాలని, ఇందుకు అనువైన మార్గం 'ధ్యానం' అని పేర్కొన్నారు. ధ్యానం అనేది విశ్రాంత స్థితి అని, నిద్రను మించిన లోతైన నిద్రావస్థ స్థితి, ఈ స్థితిలో మనసు స్థిరంగా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంటుందన్నారు.

**కౌన్సిలర్ అంటే పదవి కాదు బాధ్యత.. బ్రహ్మకుమారి కల్పన**

సమాజ హితమే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు పనిచేయాలని 'కౌన్సిలర్' అంటే కేవలం పదవి కాదని, ఒక బాధ్యత అని సుబేదారి సెంటర్ ఇంచార్జ్ బ్రహ్మకుమారి కల్పన అన్నారు. ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ప్రతినిధులైన 'కౌన్సిలర్ల' పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ వార్డు అభివృద్ధికి అహర్నిశలు శ్రమించే వ్యక్తిని నిజమైన నాయకుడిగా సమాజం గుర్తిస్తుందన్నారు. అసలు కౌన్సిలర్ అనే పదంలోని లోతైన అర్థాన్ని గమనిస్తే, ఆ పదవి వెనుక ఉన్న బాధ్యత ఏమిటో స్పష్టమవుతుందన్నారు. సి అంటే కమిట్మెంట్ అని, తన వార్డు ప్రజల సమస్యల పరిష్కారం పట్ల, అభివృద్ధి పట్ల నిరంతర కట్టుబాటు కలిగి ఉండటం అన్నారు. ఓ అంటే ఒబిడియన్స్ అని రాజ్యాంగ విలువల పట్ల, ప్రజల తీర్పు పట్ల వినమ్రతతో మెలుగుతూ సేవ చేయడం అన్నారు. యూ అంటే యూనిటీ అని కులమతాలకు అతీతంగా వార్డులోని ప్రజలందరినీ ఐక్యంగా ఉంచుతూ పురోగతి వైపు నడిపించడమన్నారు. ఎన్ అంటే నోబెల్ అని, నిస్వార్థమైన ఆలోచనలతో, ఉన్నతమైన ఆశయాలతో ప్రజా సేవలో భాగస్వామ్యం కావడమన్నారు. ఎస్ అంటే సక్సెస్ అని, కేవలం తన వ్యక్తిగత ఎదుగుదల కోసం కాకుండా, వార్డు అభివృద్ధిలో విజయాన్ని సాధించి చూపడమన్నారు. ఈ అంటే ఎడ్యుకేట్ అని, ప్రభుత్వ పథకాలు మరియు సామాజిక అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యపరచడమన్నారు. ఎల్ అంటే లాయల్ అని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిబద్ధతతో పని చేయడమన్నారు. ఓ అంటే ఆర్గనైజ్ (ప్రణాళిక) అని, వార్డులోని మౌలిక సదుపాయాలను, పనులను ఒక పద్ధతి ప్రకారం ప్రణాళికాబద్ధంగా నిర్వహించడమన్నారు. ఆర్ అంటే రెన్నోవేషన్ అని, పాత సమస్యలకు కాలం చెల్లిన పరిష్కారాలు కాకుండా, నూతన ఆలోచనలతో వార్డు రూపురేఖలను మార్చడమన్నారు. వార్డులో ఏ సమస్య వచ్చినా మొదట గుర్తుకు వచ్చే పేరు కౌన్సిలర్ అని, పైన పేర్కొన్న లక్షణాలను పుణికిపుచ్చుకున్న నాయకుడు ఉన్న చోట అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. పదవి అనేది అధికారం చలాయించడానికి కాదని, అది ఒక సేవ చేసే అవకాశమని భావించినప్పుడే ఆ పదవికి పూర్తి సార్థకత చేకూరుతుందని తెలిపారు. ఉగాదిని నూతన ఆధ్యాత్మిక సంవత్సర ఆరంభంగా, ఆత్మ పరిశుద్ధతకు సంకేతంగా జరుపుకుంటామన్నారు. ఈ పర్వదినాన 'ఆత్మకు నూతన ఆభరణం' (జ్ఞానం) అలంకరించుకోవాలని, పాత కర్మలను వదిలి కొత్త సంకల్పాలతో జీవించాలని, షడ్రుచుల పచ్చడిలా జీవితంలోని కష్టసుఖాలను సమదృష్టితో స్వీకరించాలన్నారు. ఆత్మస్థైర్యం, మహిళలే నూతన భారతానికి ధైర్యం అని, అదేవిధంగా వివిధ కార్యక్రమాల ద్వారా సమాజంలో ఆధ్యాత్మిక జాగృతి ద్వారా అందరిని చైతన్యం చేయాలనే పరమాత్ముడు ఈ సృష్టిలోకి అవతరించి ప్రవేశించే రాజయోగం ద్వారా అనేక లాభాలు కలుగుతాయని ఆమె వివరించారు. ఈ సందర్భంగా ముందస్తు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి సెంటర్ ఇంచార్జ్ శ్రీవాణి అక్కయ్య, ఈశ్వరయ్య, రాజయ్య, జ్యోతి రాణి, కౌన్సిలర్లు సొల్లు సునీత, బండ సింధూజ, ఇల్లందుల సమ్మయ్య, సందమళ్ళ పుణ్య, వజ్జెపల్లి వెంకటేశ్వర్లు, బండ వెన్నెల, ప్రతాపమంజుల, గోస్కుల రాజ్ కుమార్, పంజాల మనోజ్, వడ్లురి శ్రీలేఖ, నాంపల్లి శ్రీనివాస్, కొండా ప్రశాంతి, కేసిరెడ్డి లావణ్య, కోయాల్కర్ భారతి, తాళ్లపల్లి రమేష్, బోరాగాల మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్, వార్డు సభ్యులు




**వేద న్యూస్, పాపన్నపేట :**

పాపన్నపేట మండల పరిధిలోని డాక్య తండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం కొబ్బరికాయ కొట్టి పనులను తాండ సర్పంచి గుగులోత్ స్వప్న హీరోలాల్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్న మాట్లాడుతూ.. తండాలో ప్రతి వీధిలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి మౌలిక వసతులు మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు విట్టల్, నాయకులు తులసి రామ్, ప్రేమ్ కుమార్, గణేష్, జనార్దన్ రెడ్డి, రవి, రామ్ చందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠధామం కోసం స్థల పరిశీలన

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట పట్టణ పరిధిలోని 3వ వార్డు రామన్నపల్లి లో పెరుగుతున్న జనాభా దృశ్య వార్డులో ఎవరైనా పరమపదించినట్లైతే దహన సంస్కారాలు చేయడానికి సరైన స్థలం లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అందుకుగాను స్థానిక కౌన్సిలర్ కొలకాని రాజకుమారి రాజు తో కలిసి వైకుంఠధామం కోసం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) స్థలం పరిశీలించారు.

## ముస్లిం నిరుపేద కుటుంబాలకు రంజాన్ తోఫాల అందజేత

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కొత్తపల్లి రవికిరణ్ రుద్రూర్ గ్రామంలో 25 ముస్లిం నిరుపేద కుటుంబాలకు సోమవారం రంజాన్ తోఫాలను అందజేశారు. నిరుపేద కుటుంబాల వారు ఈ సందర్భంగా రవికిరణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శేఖర్, మైనార్టీ నాయకులు వసిం, అఫ్రోజ్, మోబిన్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా పందులు తిరిగితే కఠిన చర్యలు

- సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక



**వేద న్యూస్, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణ పరిధిలో పందుల పెంపకందారులు తమ పందులను జనావాసాల్లోకి వదలకుండా జాగ్రత్త వహించాలని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి పందులను పట్టణంలోకి వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కాలనీలు, ప్రధాన రహదారులపై పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని పురపాలక సంఘానికి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. పందుల పెంపకానికి పురపాలక సంఘం పెద్దూరు ప్రాంతంలో ప్రత్యేక స్థలాన్ని కేటాయించి అవసరమైన మౌలిక వసతులు కూడా కల్పించినప్పటికీ కొంతమంది పెంపకందారులు బాధ్యతారాహిత్యంగా పందులను పట్టణంలోకి వదులుతున్నారని ఆయన అన్నారు. ఇకపై పందులను కేటాయించిన స్థలంలోనే పెంచుకోవాలని, నివాస ప్రాంతాల్లో వదిలితే పురపాలక చట్టాల ప్రకారం భారీ జరిమానాలతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేశారు.

## లడ్డూ తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఈవో

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ భీమన్న ఆలయంలోని లడ్డూ ప్రసాద తయారీ కేంద్రాన్ని రాజన్న ఆలయ ఈవో రమాదేవి సోమవారం తనిఖీ చేశారు. లడ్డూ ప్రసాదం తయారీ విధానం, బరువు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. భక్తులకు అందించే ప్రసాదం శుభ్రతతో పాటు నాణ్యతతో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అలాగే వంటశాలలో పనిచేస్తున్న సిబ్బంది హెడ్ క్యాప్స్ ధరించి శుభ్రత నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించి పలు సూచనలు చేశారు.

## వేములవాడలో భక్తులకు ప్రత్యేక సదుపాయాలు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో వేసవి కాలంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేసవి వేడి నుంచి భక్తులకు ఉపశమనం కలిగేలా ఆలయ ప్రాంగణంలో రెండు భారీ ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ పరిసర ప్రాంతాల్లో ఫ్యాన్లు, లైటింగ్ సదుపాయాలను కల్పించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కోసం "రాజన్న జలప్రసాదం" పేరుతో రెండు తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు.

# యుద్ధం వలన రాబోయే రోజుల్లో యూరియా కొరత..!

- రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

అమెరికా ఇజ్రాయెల్,ఇరాన్ యుద్ధం వలన రాబోయే రోజుల్లో యూరియా కొరత ఏర్పడిందని,యుద్ధం నేపద్యంలో మోదీ ప్రభుత్వం ఏం చేయాలో ఆలోచించలేని స్థితిలో ఉందని రాజ్య సభ సభ్యురాలు రేణుకా చౌదరి అన్నారు.సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం లో జిల్లా అధ్యక్షుకు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, ఇజ్రాయిల్,ఇరాన్ యుద్ధంతో భారతదేశం ఇబ్బందిపడుతుందన్నారు.ఎల్పీజీ సిలిండర్ పై కేంద్ర ప్రభుత్వం మూడు నెలల్లో 300 రూపాయలు పెంచిందనీ అబద్ధాలు చెప్పే కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నేడు జరగబోయే పార్లమెంట్ సమావేశంలో ఇదే విషయంపై మాట్లాడబోతున్నాను అని స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో రైతులకు నష్టపోయే అవకాశం ఉంది అని, ఈ యుద్ధం వల్ల యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉంది అని అన్నారు.సామాజిక మాధ్యమాల్లో వచ్చే అన్ని నమ్మాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో అడ్డగోలు ప్రచారం చేస్తున్నారని,ఇప్పటివరకు జరిగిన యుద్ధంలో ఇరాన్ దే పై చేయి అని అన్నారు.యుద్ధం నేపథ్యంలో ఏం చేయాలో ఆలోచించలేని స్థితిలో ప్రధాని మోడీ ఉన్నాడు అని విమర్శించారు.ఆ భద్రాచల శ్రీరాము చంద్రుని ఆశీస్సులు దేశ ప్రజలకు ఉండాలనీ ఆకాక్షించారు.ఇంకా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కరెంట్ లేని గూడాలు ఉన్నాయనీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటూ కు బిజెపి ఓటు వేయలేదా? తెలంగాణ రాష్ట్రం అంటే బిజెపి కి ఎందుకు అంత చిన్న చుపు అని ప్రశ్నించారు.రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతగానో కష్టపడుతున్నాడనీ అన్నారు. ఆయిల్ తో పాటు ప్లాస్టిక్ రేట్లు పెరిగే అవకాశం ఉంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి,శాసనమండలి మాజి సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, టి పి సి సి అధికార ప్రతినిధి కొరివి వెంకటరత్నం, టి పి సి సి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు,ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్,కొత్తగూడెం గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వడ్డేబోయిన నరసింహారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి హనుమంతరావు ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐ యన్ టి యు సి అధ్యక్షులు షేక్ జలీల్ , వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని మంజులనరేంద్ర, రంగా జనార్ధన్,ముళ్ళపాటి సీతారాములు,కిలారి అనిల్ కుమార్, గజ్జి సూర్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా రెవెన్యూ అధికారిణి

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ప్రజల అర్జీలను స్వీకరించారు. తల్లాడ మండలం మల్లారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కే. కిరణ్ కుమార్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ బీసీ హాస్టల్ భవనంలోకి మార్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంహెచ్ఓకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక నుంచి ఖమ్మం మూడవ టౌన్ ప్రాంతం గాంధీ చౌక్ లో ఉన్న ఈద్గాను మరమ్మత్తులు, గోడ నిర్మాణం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్డిఓకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. వైరా మండలం కోష్టాల గ్రామానికి చెందిన వార్డు సభ్యులు వి. సాంబయ్య గ్రామ సర్పంచ్ తన ఇష్టానుసారంగా నర్సరీ మొక్కలను పెంచుతున్నారని గ్రామానికి నష్టం జరుగుతుందని నివారించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వైరా ఎంపిడిఓ/డి.ఎల్.పి.ఓ. కు రాస్తూ విచారించి తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు మూడేళ్లు



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ముదిగొండ అంబేద్కర్ సెంటర్ లో కేక్ కట్ చేసి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ప్రాముఖ్యతను వివరించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చేపట్టిన పాదయాత్ర రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కీలక పాత్ర పోషించిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ముదిగొండ మండలంతో పాటు మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని భట్టి విక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే తీపి గుర్తుగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ గ్రామ సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 17, 2026

# అప్రెంటిస్‌షిప్‌లతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయా..?

**– లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ప్రశ్న**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

పరిశ్రమల్లో నైపుణ్య శిక్షణతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచే లక్ష్యంతో అమలు చేస్తున్న జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రోత్సాహక పథకం (ఎన్‌ఏపీఎస్) ఫలితాలపై లోక్‌సభలో చర్చ జరిగింది. పథకం అమలు పరిస్థితులు, అప్రెంటిస్ నియామకాల లక్ష్యాలు, సాధించిన గణాంకాలపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి..మలి విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గత ఆర్థిక సంవత్సరం,ఈ ఏడాదికి సంబంధించి అప్రెంటిస్‌ల నియామకాలు ఎంతవరకు జరిగాయి? ఏ రంగాల్లో శిక్షణ అందిస్తున్నారు? యువతకు ఉపాధి అవకాశాల పెంపులో ఈ పథకం ఎంతవరకు సహకరిస్తోందని ఆయన ప్రశ్నించారు.

దీనికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి లిఖిత సమాధానం ఇచ్చారు. అప్రెంటిస్‌లకు చెల్లించే కనీస భృతిలో 25 శాతం వరకు (గరిష్ఠంగా నెలకు రూ.1500) కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం అందిస్తోందని తెలిపారు. ఈ మొత్తాన్ని నేరుగా డీబీటీ ద్వారా అప్రెంటిస్‌ల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు.



**లక్ష్యాలు నియామకాలు**

202425 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం 12 లక్షలు కాగా 9.85 లక్షల మంది అప్రెంటిస్‌లను నియమించినట్లు తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం 13 లక్షలు కాగా, ఇప్పటివరకు 9.24 లక్షల మంది అప్రెంటిస్‌లను నియమించినట్లు చెప్పారు. ఆటోమొబైల్, సమాచార సాంకేతిక సేవలు, ఎలక్ట్రానిక్స్, రిటైల్, తయారీ, పర్యాటకం, టెలికాం, సరుకు రవాణా తదితర రంగాల్లో అప్రెంటిస్ శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. 72 శాతం అప్రెంటిస్‌లు శిక్షణ అనంతరం పూర్తి స్థాయి ఉద్యోగ అవకాశాలు పొందినట్లు వెల్లడైందన్నారు.

**వ్యవస్థ బలోపేతానికి చర్యలు**

అప్రెంటిస్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు భృతిలో 36 శాతం పెంపు, మిశ్రమ శిక్షణ విధానం, వికలాంగులకు అవకాశాలు, కొత్త రంగాల్లో అప్రెంటిస్ అవకాశాల విస్తరణ వంటి చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

# వేములవాడలో పొట్టి శ్రీరాములు జయంతి

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ పట్టణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిద్ధంశెట్టి వేణు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిద్ధంశెట్టి వేణు మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమరయోధుడిగా క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాల్లో పాల్గొన్న మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. తెలుగు భాష మాట్లాడే వారందరికీ ఒకే రాష్ట్రం ఉండాలనే లక్ష్యంతో 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన ఆయన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. భాషా ప్రాయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన చేసిన త్యాగాన్ని ఎప్పటికీ స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కమిటీ చైర్మన్ కట్కూరి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నరాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొమ్మ నటరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త అనిల్, గౌరవ అధ్యక్షులు నగబోతు రవి, చేపూరి రవి, ఉపాధ్యక్షుడు ఉప్పలంచ సత్యనారాయణ, మీడియా కన్వీనర్ జిల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ మున్సిపాలిటీలో

# కొత్త వాహనాల ప్రారంభం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చేందుకు కొత్తగా కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు, ఒక వాటర్ ట్యాంకర్ ట్రాలీని సోమవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. సుమారు రూ.21.50 లక్షల వ్యయంతో ఈ వాహనాలను కొనుగోలు చేసినట్లు చైర్మన్ తెలిపారు. పట్టణంలో చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఉన్న వాహనాలకు అదనంగా ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు మున్సిపాలిటీ వద్ద 6 ట్రాక్టర్లు ఉండగా, పట్టణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని వాహనాలు అవసరమని గుర్తించి వీటిని సమకూర్చుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా గాంధీ విగ్రహం

**– కళ్లజోడు అమర్చాలని కలెక్టర్‌కు వినతి**

**వేద న్యూస్, సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి కళ్లజోడు లేక అసంపూర్తిగా ఉందని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన కొత్వాల్ సాయిరాం పట్టణ కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న గాంధీజీ విగ్రహానికి గత కొంతకాలంగా కళ్లజోడు లేకపోవడం గమనించి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు వినతి పత్రం సమర్పించారు. గాంధీజీ విగ్రహానికి తగిన కళ్లజోడు అమర్చాలని ఆయన కోరారు. మహాత్మా గాంధీపై తనకు ఉన్న గౌరవంతోనే ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు సాయిరాం తెలిపారు. మహనీయుల విగ్రహాలను సక్రమంగా సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# గంగాధర పంచాయతీ సిబ్బందికి సన్మానం

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం భాగంగా పంచాయతీ సిబ్బందికి సన్మానం నిర్వహించారు. సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న పంచాయతీ కార్యదర్శి, సఫాయి కార్మికులు, వాటర్‌మెన్లను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పంచాయతీ సిబ్బంది కృషి ఎంతో కీలకమని అన్నారు. ఎండా వానలను లెక్కచేయకుండా పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అమూల్యమని, వారిని గౌరవించడం సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం సిబ్బందికి అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధితుడికి అండగా విప్ ఆది శ్రీనివాస్

**వేద న్యూస్, కోనరావుపేట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన జోగు తరుణ్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించారు. నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి తరుణ్‌కు ప్రత్యేక వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. అలాగే వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం నుంచి రూ.4.50 లక్షల విలువైన ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను వెంటనే మంజూరు చేయించారు. ఈ సహాయం అందడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల సొంతింటి కల సాకారం కావాలి

**– మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**– ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష**

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణాల పురోగతిపై సోమవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ సంపత్ కుమార్ వార్డు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక గూడు పేద కుటుంబానికి అత్యంత భరోసా కలిగించే అంశమని, ఈ పథకం ద్వారా లబ్ధిదారులు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కలుగుతుందని తెలిపారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే నిధులు సకాలంలో అందేలా చూడాలని, నిర్మాణ పనుల్లో సాంకేతిక సహాయం అందిస్తూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందేలా చూడాలని పుల్కం రాజు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు అధికారులు పాల్గొన్నారు.



# రంగారావుపల్లి పంచాయతీ సిబ్బందికి సన్మానం

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కృషి చేస్తున్న సఫాయి కార్మికులు, వాటర్‌మెన్లను సర్పంచ్ దాసరి శంకరయ్య శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో పంచాయతీ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. ఎండా వానలను లెక్కచేయకుండా పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అమూల్యమని, వారిని గౌరవించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం సిబ్బందికి అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ద్యావ బహద్దూర్ రెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బోయినిపల్లిలో కోతుల బీభత్సం

**– ఇళ్లలోకి చొరబడి వస్తువులు ధ్వంసం – భయాందోళనలో గ్రామస్తులు**

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. గ్రామంలోని పలు కాలనీల్లో కోతులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇళ్ల పైకప్పులపై ఎక్కి తిరుగుతూ పలు ఇళ్లలోకి చొరబడి ఇంటి సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంటగదుల్లో ఉన్న పదార్థాలను చెదరగొట్టడంతో పాటు ఇళ్లపై ఉన్న రేకులు, పెంకులను లాగి చెల్లాచెదురు చేస్తున్నాయని తెలిపారు. దీంతో ఇళ్లకు నష్టం వాటిల్లడంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోతుల బెడద కారణంగా చిన్నపిల్లలు, మహిళలు బయటకు వెళ్లేందుకు కూడా భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో కోతులు గుంపులుగా వచ్చి ఇళ్లపై తిరుగుతుండటంతో ప్రజలు తలుపులు మూసుకుని ఉండాల్సి వస్తోందని గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకుని కోతుల బెడద నుంచి గ్రామాన్ని రక్షించాలని గ్రామ సర్పంచ్‌ను ప్రజలు కోరుతున్నారు. అవసరమైతే కోతులను పట్టుకుని అడవుల్లోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

# వేములవాడలో శ్రీరామ నవమి వేడుకలకు శ్రీకారం

**– భీమేశ్వర స్వామి మండపంలో పోస్టర్ ఆవిష్కరణ**

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి సంబంధించిన పోస్టర్, ఆహ్వాన పత్రికలను భీమేశ్వర స్వామి మండపంలో సోమవారం ప్రత్యేక పూజల అనంతరం ఆవిష్కరించారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి భక్తుల సమక్షంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

# నీటి కాల్వకు అడ్డంగా చెక్కలు

**– ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు.. కేసు నమోదు**

**వేద న్యూస్, రుద్రంగి:**



నీటి కాల్వ ప్రవాహానికి అడ్డుకట్ట వేసి ప్రమాదకర పరిస్థితి సృష్టించిన గుర్తుతెలియని వ్యక్తులపై రుద్రంగి పోలీసులు కేసు నమోదు చేశారు. జోగాపూర్ పంప్ హౌస్ నుంచి కాల్వ ద్వారా నాగారం చెరువుకు నీటిని తరలిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రుద్రంగి గ్రామ శివారులోని ఒక తూము వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా చెక్కను అడ్డంగా పెట్టడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి కాల్వ కట్టపై ఒత్తిడి పెరిగింది. సకాలంలో గుర్తించకపోతే కాల్వ తెగిపోయి సమీపంలోని పంట పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉండేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ వినయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు రుద్రంగి ఎస్ఐ మోతిరాం తెలిపారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# అంత్యక్రియల అనంతరం భోజనం పంపిణీ

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ పట్టణంలోని 4వ వార్డు మహాలక్ష్మి వీధికి చెందిన పోనెటి వెంకవ్వ మరణించగా, అంత్యక్రియల అనంతరం వారి కుటుంబ సభ్యులకు అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు భోజనం అందజేశారు. ఈ విషయాన్ని రేగుల రాజ్‌కుమార్ ట్రస్ట్ నంబర్‌కు ఫోన్ ద్వారా తెలియజేయగా, సకాలంలో భోజనం పంపించినట్లు సంస్థ నిర్వాహకులు తోట లహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో ఎవరైనా మరణించిన సందర్భాల్లో సంబంధిత కుటుంబ సభ్యులు లేదా స్థానికులు ట్రస్ట్ నంబర్ 8919376459కు సమాచారం అందిస్తే, అంత్యక్రియల అనంతరం బాధిత కుటుంబానికి ఉచితంగా భోజనం అందజేస్తామని తెలిపారు.

## తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మురుగు నీరు నిల్వ

**- పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి**

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి మున్సిపాలిటీలోని 8వ వార్డు పరిధిలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మురుగు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల మధ్యలో నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిల్వ నీటి కారణంగా దోమలు, పందులు పెరిగి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని స్థానికులు తెలిపారు. పట్టణంలోని పలు కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉందని పేర్కొన్నారు. నూతన పాలకవర్గం, అధికారులు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి మురుగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేశారు.

## కాల్వల ప్రాజెక్ట్ మత్తడికి వెంటనే మరమ్మతులు చేయాలి

**- ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేపడతాం**
**- తెలంగాణ జాగృతి నేతలు**

**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ జాగృతి జిల్లా స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉన్న పలు ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పోరాటాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ మానకొండూర్, హుజురాబాద్ నియోజకవర్గాల పరిధిలోని శంకరపట్నం, వీణవంక మండలాల రైతులకు ఉపయోగపడే కాల్వల ప్రాజెక్ట్ మత్తడి కొట్టుకుపోయి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు మరమ్మత్తులు చేపట్టలేదని విమర్శించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 15 నుంచి 20 గ్రామాల రైతులు ప్రయోజనం పొందుతారని తెలిపారు. ప్రాజెక్ట్ దెబ్బతిన్న తర్వాత స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆయన ఆరోపించారు. గతంలో జాగృతి జనంబాట కార్యక్రమంలో కల్వకుంట్ల కవిత స్వయంగా ప్రాజెక్ట్ పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వాన్ని హెచ్చరించినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో రైతులను కలుపుకొని ఎల్ఎమ్డీ కాలనీలోని ఇరిగేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా మహిళ అధ్యక్షురాలు అక్కం శివరాణి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, ఆదివాసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా నాయకులు బుడిగె పర్శారం గౌడ్, రంగరవేణి లక్ష్మణ్, బసవేణి రాజేందర్, గర్శకుర్తి విద్యాసాగర్, గాడిచర్ల కొమరయ్య, మహిళా నాయకురాలు జంగ అపర్ణ, యండి సల్మ, బశెట్టి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి రిషిత 'కర్ణవేదన' వేడుక

**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలంలోని నందిగామ గ్రామంలో కొమ్ము రమ్య-తిరుపతి దంపతుల కుమార్తె రిషిత కర్ణవేదన (చెవులు కుట్టు) వేడుక సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. రిషిత ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో నల్లబెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని మహేష్, నందిగామ గ్రామ అధ్యక్షుడు జంగిలి మోహన్, రేలకుంట గ్రామ అధ్యక్షుడు వెంగళదాసు రమేష్, గ్రామ సర్పంచ్ భూక్య భాస్కర్, మాజీ గ్రామ అధ్యక్షుడు కందికొండ రాములు పాల్గొన్నారు. అలాగే కలం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొమ్మురాజు, గౌరవ అధ్యక్షుడు బచ్చు కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు పదాల మురళి, ప్రధాన కార్యదర్శి వోల్లాజీ సురేష్, సహాయ కార్యదర్శి జహంగీర్ పాషా తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

**- సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. గౌతమ్ చౌహాన్‌కు వినతి**

**వేద న్యూస్, హనుమకొండ:**



ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రావలసిన ఐదు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) హనుమకొండ జిల్లా నాయకుడు బత్తుల విష్ణుమూర్తి పరకాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. గౌతమ్ చౌహాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నెలల తరబడి వేతనాలు రాక ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేతనాలు ఆలస్యమవడంతో ఉద్యోగులు ఇంటి అద్దె, కరెంట్ బిల్లులు, పిల్లల విద్యా ఫీజులు, ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రస్తుతం సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్, జనవరి నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 16వ తేదీ లోపు వేతనాలు చెల్లించకపోతే మార్చి 17న లంచ్ సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ ఎస్. ప్రమీల, ల్యాబ్ టెక్నీషియన్ ఎం. ప్రశాంత్, డేటా ఎంట్రీ ఆపరేటర్ చల్ల రోజా, ల్యాబ్ అటెండర్ కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని యువతి ఆత్మహత్య

**వేద న్యూస్, కాజీపేట:**



కాజీపేట దర్గా పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన అంబాల తులసి (19) అనే నర్సింగ్ విద్యార్థిని తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు వెంటనే అమలు చేయాలి

**- బీజేపీ జడ్చర్ల మండల శాఖ**

**వేద న్యూస్, జడ్చర్ల:**



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు మిడ్జిల్ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్‌కు సోమవారం మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. రైతులకు రైతు భరోసా సమయానికి అందకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే అర్హులైన వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు మంజూరు చేయాలని, పేదలకు గృహ నిర్మాణ పథకాన్ని వేగవంతం చేయాలని కోరారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, వీధి దీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, మాజీ మండల అధ్యక్షుడు నరేందర్, మండల ప్రధాన కార్యదర్శి వాసుదేవ్, శేఖర్, దామోదర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కావాలి నరేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరిక

**వేద న్యూస్, చిన్న చింతకుంట:**

చిన్న చింతకుంట మండలం ఉంధ్యాల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలతో ఆకర్షితులై వారు పార్టీలో చేరినట్లు తెలిపారు.

## క్రికెట్ కిట్‌తో పాటు రూ.10 వేలు విరాళం

**- హైకోర్టు అడ్వకేట్ మందడి సరోజ్ రెడ్డి**



**వేద న్యూస్, దేవరకద్ర:**

కొత్తకోట మండలం పాలెం గ్రామంలో వివేకానంద క్రికె ట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ కు ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు అడ్వకేట్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి క్లబ్ సభ్యులకు క్రికెట్ కిట్‌తో పాటు రూ.10 వేల నగదు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా క్రికెట్ క్రీడాకారులు మందడి సరోజ్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. యువత చదువుతో పాటు క్రీడా రంగంలో కూడా ముందుండాలని, యువకుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని సరోజ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, సరోజ్ మిత్రమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి రూ.30 వేల ఆర్థిక సహాయం

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**



చిన్నచింతకుంట మండలం చిన్నవడ్డేమాన్ గ్రామానికి చెందిన వడ్డే గట్టన్న ఇల్లు ఇటీవల కూలిపోవడంతో ఇంటి నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో హైకోర్టు అడ్వకేట్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గట్టన్న పరిస్థితి తెలిసిన వెంటనే ఇంటి నిర్మాణానికి సహాయంగా ఈ నగదును అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గట్టన్న కుటుంబ సభ్యులు మందడి సరోజ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భర్త రాము, చిన్న సాయిలు, సంతోష్ రెడ్డి, మహమూద్, వడ్డే మహేందర్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సహాయం

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**



చిన్నచింతకుంట మండలం చిన్నవడ్డేమాన్ గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ బర్ల కూర్మక్క అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న హైకోర్టు అడ్వకేట్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భర్త రాము, చిన్న సాయిలు, సంతోష్ రెడ్డి, మహమూద్, వడ్డే మహేందర్, కురుమూర్తి, సరోజ్ మిత్రమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఈశ్వర వీరప్పయ్య సప్తహ మహోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, దేవరకద్ర:**



దేవరకద్ర మున్సిపాలిటీలోని శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న 97వ సప్తహ మహోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**వేద న్యూస్, దేవరకద్ర:**





దేవరకద్ర మున్సిపాలిటీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన అధికారిక ఇఫ్తార్ విందులో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073